# దుశ్శాసనం

"సుమిత్ర హాజిర్ హో......"

వాడి కేకకి ఎన్ని గుండెలో రగుల్తాయ్...పగుల్తాయ్... అడుగులు తడబడి కదుల్తాయ్... ఏళ్ళతరబడి జీవితాల్ని ధారబోసిన వాళ్ళ శాపనార్థాలు వాడి గొంతుకు చుట్టుకున్నట్టు జీరబోయిన పాట...

"సుమిత్ర హాజిర్ హో..."

కోర్టు హ్యాలు అరుపుకి కొద్దిగా తడబడి బోను వైపు కదిలింది సుమిత్ర. బోను ఎక్కుతూనే కొంగు నిండారుగా కప్పుకుంది. వానకు తడిసి స్వచ్ఛంగా మెరిసి నేలరాలిన మల్లెపూవులా ఉంది ఇంకా పెళ్ళికాని సుమిత్ర.

అటువైపు బోనులో వాడు... రాక్షసుడు... కీచకుడు... దుశ్శాసనుడు.... దుర్యోధనుడు... న్యాయమూర్తి తలమీద గాంధీతాత పట్నం లేకపోయినా 'సిబాకా' అడ్వర్టైజ్‌మెంట్ స్టిల్‌లా నవ్వుతున్నాడు.

ఎర్రగుడ్డ కప్పబడిన భగవద్గీత మీద సుమిత్ర చేతులుంచింది.

హత్యలు చేసిన రక్తపు చేతులెన్నో ఆ పుస్తకం మీద పడ్డట్టు ఎర్రగుడ్డ మెరుస్తోంది. ఆ భగవద్గీతలో... ఆ భారతంలో గుడ్డలిప్పబడిన ద్రౌపది సాక్షిగా.... నిజమే చెబుతాననుకుంది సుమిత్ర.

ఒక నల్లకాకి రెక్కలు దులుపుకొని లేచింది.

దొండపండులా ఉన్న సుమిత్రను 'కళ్ళ' తో పొడిచింది. ఆ 'కుళ్లు' తాకకుండా సుమిత్ర కనురెప్పలు దించి సమాధానాలిస్తోంది.

ఆ నల్లకాకి గబ్బిలంలా మారి ఆ బోనుకూ, ఈ బోనుకూ నడుమ తిరుగుతూ, అరుస్తూ, ఆయాసపడ్తూ...గ్రుచ్చి గ్రుచ్చి సుమిత్రను కొరుక్కుతింది.

వాడు చాటుగా మానాన్ని చెరిచాడేమో

వీడు బహిరంగంగా గుండెను తొలిచాడు...

ఎక్కడో తనని రక్షించాలనుకునే ఒక కోయిల 'అబ్జెక్షన్ యువ రానర్' అంటూ లేచింది. గ్రీష్మంలాగా మారిన బతుకులో కోయిలకూసినా వసంత మొస్తుందా? సైలెన్స్... సైలెన్స్ అంటూ సుత్తి తలబద్దలు కొట్టుకుంది.

గబ్బిలం మళ్ళీ విజృంభించింది.

బోనులో వాడు దుశ్శాసనుడు, ఉక్కపోతకు నిర్లక్ష్యంగా కాల రెగరేసుకుంటున్నాడు. సుమిత్ర కనురెప్పల క్రిందినుంచే గమనించింది. వాడి పెదవుల మీద చిరుదరహాసం.... సుమిత్ర కళ్ళలో సుడిగుండాలు...

సుత్తి మళ్ళీ తలబాదుకుంది.... క్షణాల్లో నిశ్శబ్దం!

"ఆమె మానం పోయినందున... ఆమె మౌనంగా ఉన్నందున.... దుశ్శాసనునికి అయిదుపందల రూపాయల జరిమానా లేదా ఒక సంవత్సరం కారాగార శిక్షనిస్తూ తీర్పు చెప్పడమైనది."

లేదా అన్న పదానికి అక్కడ చాలా విలువుంది.

వాడు బోనులోనే డబ్బు లెక్కపెడుతున్నాడు బయట పడాలని. వాడు అన్నిటా సమర్థుడే... అయిదొందలుకాదు అయిదు లక్షలు జరిమానా వేసినా ఈ నల్లకాకుల్నీ, న్యాయ దేవతనీ పచ్చనోట్లతో కప్పి పారిపో గలడు.

"చివరగా నువ్వేదయినా చెప్పుకుంటావామ్మా" అడిగాడు జడ్జి.

సుమిత్ర నోరు తెరిచింది. దుఃఖం వెల్లువై వస్తుంటే...

"సార్.... నా మానం ఖరీదు అయిదొందలు కాకూడదు. అంతే గనుక అయితే ఆంధ్రదేశంలోని ఆడపడుచుల మానాల్ని 'అర్రాస్' పెట్టి అయిదు నిముషాల్లో కొనెయ్యగలడు వాడు... అందుకే... అందుకే.... యువరానర్.... వాణ్ని నపుంసకుణ్ని చెయ్యండి"

బాంబు ప్రేలినంత కలకలం కోర్టులో....

కేవలం ఆమె అభ్యర్ధనకే త్రుళ్ళిపడ్డ దుశ్శాసనుడు 'నో' అని అరిచాడు.

"నన్ను నపుంసకుణ్ణి చెయ్యొద్దు... ప్లీజ్.... సంసారానికి పనికి రాకుండా చెయ్యొద్దు. నన్ను నపుంసకుడిని చెయ్యకండి...." వాడు అరుస్తూనే ఉన్నాడు.

ఆ అరుపులు అతనివి కావనీ, తన ఆలోచనలో తను అతనికి విధించిన శిక్ష తాలూకువనీ ఆమెకి తెలియదు.

న్యాయదేవతలాగా అన్యాయానికి గురైన ఆమె కళ్ళు మూసుకునే ఉన్నాయి.

★